క్లుప్తంగా

గోదావరి పరిసరాలు శుభ్రం



గోదావరిలో శుభ్రం చేస్తున్న సిబ్బంది

ధర్మపురి: గోదావరి పరిసరాల్లో శనివారం అధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమం చేపట్టారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది గోదావరిలో పేరుకు పోయిన చెత్తా చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

ప్రధాని మోదీ, యూపీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: మహాకుంభమేళా విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ భారత్ సురక్షా సమితి నాయకులు శనివారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ప్రధాని మోదీ, యూపీ సీఎం యోగి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మహా కుంభమేళాను ఘనంగా నిర్వహించిన మోదీ, యోగిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాసుస రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, పుప్పాల సత్యనారాయణ, చిట్ల గంగాధర్, వేముల పోచమల్లు, నరేందుల శ్రీనివాస్, ప్రభాకర్, దేవరాజం, వెంకట్‌రెడ్డి, కస్తూరి లక్ష్మారెడ్డి, తునికి అంజన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హేమలత

కోరుట్ల: పట్టణంలో వ్యర్థాల నిర్వహణపై 7 మున్సిపాలిటీల అధికారులకు కోరుట్లలో శనివారం అవగాహన కల్పించారు. కంపోస్టింగ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హేమలత వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. కోరుట్లలోని డీఆర్‌సీసీని సందర్శించి కంపోస్టింగ్, రీసైక్లింగ్ విధానం తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, 7 మున్సిపాల్టీల కమిషనర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, డీఈలు, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి చేయూత



ఆర్థికసాయం అందిస్తున్న సీఐ

ధర్మపురి: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న నిరుపేదకు ఫేస్‌బుక్ మిత్రులు చేయూతనందించారు. ధర్మపురికి చెందిన నరేందుల దామోదర్‌ది నిరుపేద కుటుంబం. ఓ కూరగాయల షాపులో పని చేస్తూ తన కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు. 4 నెలలుగా క్యాన్సర్ తో కుటుంబ పోషణ, వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్నారు. వీరి దీన స్థితిని తెలుసుకున్న సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్‌ఫిబ్రవరి 3న ఫేస్‌బుక్‌లో పోస్టు చేసి సాయం కోరాడు. ఎన్నారైలు, ఇతర దాతలు స్పందించి బాధితుడి భార్య గంగాభవాని బ్యాంక్ ఖాతాకు రూ. 1.63 లక్షలు విరాళాలు పంపించారు. వాటి నుంచి ప్రస్తుత వైద్య ఖర్చులకు రూ.50 వేలను సీఐ రాంనర్సింహారెడ్డి చేతుల మీదుగా వారికి అందించారు. మిగిలిన డబ్బులు ఆమె బ్యాంక్ ఖాతాలో నిల్వ ఉంచినట్లు రమేశ్ తెలిపాడు. ఈ సందర్భంగా సాయం అందించిన దాతలు, రమేశ్‌ను సీఐ అభినందించారు.

సీసీ కెమెరాలతో భద్రత

వెల్గటూర్ : సీసీ కెమెరాలతో భద్రత పెరుగుతుందని ధర్మపురి సీఐ రాంనర్సింహా రెడ్డి అన్నారు. ఎండపల్లి మండలం కొత్తపేట మార్కండేయ ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ గ్రామంలోని దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై ఉమాసాగర్, ఆలయ కమిటీ చైర్మన్ పురుషోత్తం కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





మహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవం ప్రారంభం

సారంగాపూర్: మండలంలోని పోతారంలో శ్రీమహాలక్ష్మీ ఆలయ 15 వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం రెండో రోజు ఆలయ అర్చకులు గుగ్గిళ్ల పుల్లయ్య, గుగ్గిళ్ల రాజశేఖర్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, మండపారాధన, వివిధ పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కొత్తపెల్లి రాజేశం, ఉపాధ్యక్షుడు పంతకాని లక్ష్మణ్, అయిత అశ్విన్, కంచర్ల రమేశ్, జోగినపల్లి కిరణ్‌రావు, గాడిపెల్లి వెంకటేశ్, సింగం సత్తయ్య, భక్తులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఊరేగింపు

కథలాపూర్: మండలం చింతకుంటలో మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శనివారం రాత్రి మల్లికార్జునస్వామిని పల్లకిపై గ్రామంలో ఊరేగించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జాతర ఉత్సవాలు నాలుగు రోజుల పాటు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

మహిళా సంఘాలకు సొంత భవనాలు కరువు

- సమావేశాలకు ఇబ్బంది పడుతున్న మహిళలు
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం
- భవనాలు నిర్మించాలని కోరుతున్న సభ్యులు



రామభద్రునిపల్లిలో సమావేశమైన స్వశక్తి మహిళలు(ఫైల్)

పెగడపల్లి: జిల్లాలో ఉన్న మహిళా సంఘాలకు సొంత భవనాలు లేక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాఖ్య సంఘాలకు భవనాలు నిర్మించాలని సంఘం సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాల నిర్వహణ కొనసాగుతోంది. స్వశక్తి సంఘాల ఏర్పాటు నుంచి ఇప్పటివరకు సొంత భవనాలు లేవు. ప్రతి నెలా గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు సొంత భవనాలు లేక సంఘం సభ్యులు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బంది పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. చేసేదేమి లేక చెట్ల కిందనో, సభ్యుల ఇళ్లలో సమావేశాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం దృష్టి సారించడం లేదని వారు పేర్కొంటున్నారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో 565 గ్రామాఖ్య సంఘాలు, 18 మండల సమాఖ్యలుండగా, 14,565 స్వయం సహాయక సంఘాలు, 1,73,356 మంది సభ్యులున్నారు. స్వయం ఉపాధి కార్యక్రమాలతో జీవనోపాధి అవకాశాలు పెంపొందించుకుంటూనే పొదుపులో స్వయం సహాయక సంఘాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. కాగా గ్రామస్థాయిలో కార్యాలయాలు లేక మహిళలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూళ్లు, సభ్యుల్లో చైతన్యం పెంపొందించడంలో కీలకపాత్ర పోషించే గ్రామ సంఘాలకు సరైన వేదికలు అందుబాటులో లేకపోవడంతో ఆశించిన లక్ష్యం నెరవేరడం లేదన్న విమర్శలున్నాయి. స్వయం సహాయక సంఘాలకు సొంత భవనాలు లేక పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. సంఘాల కార్యకలాపాల నిర్వహణతో పాటు మహిళా సమాఖ్యలు, మహిళా పొదుపు సంఘాల సమావేశాల నిర్వహణ, శిక్షణలు చేపట్టడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వివిధ పనుల కోసం వచ్చిపోయే మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులు సమావేశాలకు అవస్థలు పడుతున్నారు. మహిళా సంఘాల నిర్వహణ కోసం మండల కేంద్రాల్లో ఇందిరా క్రాంతిపథం పేరిట సొంత భవనాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 37 గ్రామాఖ్య సంఘాలకు మాత్రమే సొంత భవనాలుండగా 528 సంఘాలు అద్దె భవనాల్లో నెట్టుకొస్తున్నారు. 18 మండల సమాఖ్యలకు గానూ 14 చోట్ల మాత్రమే మండల కార్యాలయాలున్నాయి. స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం గ్రామాల్లో సంఘ భవనాలు నిర్మిస్తే సంఘాల నిర్వహణలో తలెత్తే సమస్యలు దూరమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా మహిళా సంఘాలకు సొంత భవనాలు నిర్మించాలని మహిళా సంఘాల సభ్యులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



గ్రామాల్లో గ్రామాఖ్య సంఘ భవనాల నిర్మాణాలకై గతంలోనే ప్రతిపాదనలు పంపాం. స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం సొంత భవనాల నిర్మాణాల విషయం ప్రభుత్వ పరిధిలో ఉంది ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. నిధులు మంజూరయితే స్థలాలు సేకరించి భవనాలు నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంటుంది.

రఘువరన్ డీఆర్డీవో



మేడిపల్లి: మండలంలోని కాచారం గ్రామ శివారులో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. కాచారం నుంచి మల్యాల ఎక్స్ రోడ్డు వరకు డబుల్ రోడ్డు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కానీ అధికారులు భద్రతా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. కాచారం గ్రామ శివారులో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుకు ఆనుకుని ఉన్నా.. కనీసం రక్షణ చర్యలు తీసుకోలేదు. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని కోటగిరి లింగాగౌడ్ కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: అర్జున్
ట్రాన్స్‌కో ఏఈ, మేడిపల్లి, సెల్ నంబర్: 9440811471

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

మాదిగ అమరవీరులకు నివాళి



పెగడపల్లిలో నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ధర్మపురి: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం మాదిగ అమరుల దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కట్ట లక్ష్మణ్ ఆధ్వర్యంలో అమరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చిలుముల లక్ష్మణ్, పారెపెల్లి రాజమల్లయ్య, అరికెల్ల సతీశ్, నాయకులు పాల్గొన్నారు.

బుగ్గారం(గొల్లపల్లి): వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువబోమని గొల్లపల్లి మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చెవులమద్ది రమేశ్ మాదిగ అన్నారు. గొల్లపల్లిలో శనివారం మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. .కార్యక్రమంలో నాయకులు ముల్కాల శ్రీనివాస్, తలకొండ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం పెగడపల్లిలో కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద అమరవీరుల పోస్టర్ ఆవిష్కరించి వారి సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, స్వామి, అంజయ్య, తరుపతి, శంకర్, రాజయ్య, భూమయ్య, వినోద్, లక్ష్మణ్, రాకేశ్, బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెల్గటూర్ : మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ వెల్గటూర్ మండల అధ్యక్షుడు చెన్న కుమారస్వామి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వర్గీకరణ పోరాటంలో ప్రాణాలు అర్పించిన అమరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అనిల్, రాజేష్, నాగేష్, లచ్చయ్య, రమేశ్, లింగయ్య, రాజయ్య, శ్రీనివాస్, చిలుకయ్య, వినయ్ పాల్గొన్నారు.

తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్ (42) మద్యం తాగుడుకు బానిసై శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం శ్రీనివాస్ తాగుడుకు బానిసై శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకుని తాను పురుగుల మందు తాగానని చెప్పి కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

జగిత్యాల: జిల్లాలో కంకర, గ్రానైట్, ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మైనింగ్ శాఖ ఏడీ జైసింగ్ అన్నారు. కలెక్టరేట్‌లో స్టోన్ క్రషర్స్, గ్రానైట్స్ వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రవాణాకు బిల్లులు ఉండాలని, లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం:జిల్లాకేంద్రంలోని అన్నపూర్ణ చౌరస్తా సమీపంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా సీసీఎస్ ఎస్సై రవీందర్ ఆధ్వర్యంలో దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.21 వేలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పట్టణ పోలీసులకు అప్పగించామని ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కథలాపూర్: మండలంలోని బొమ్మెన గ్రామ శివారులోని వాగులో నుంచి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుంటే పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని ఆర్ఐ నాగేశ్ శనివారం తెలిపారు. ఇసుకను బొమ్మెన నుంచి మేడిపెల్లి మండలానికి తరలిస్తుంటే పట్టుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

సైన్స్ ప్రదర్శనలతో విద్యార్థులకు మేలు



కోరుట్లలో సైన్స్ ప్రదర్శనలు తిలకిస్తున్న ఎంఈవో నరేశం

ధర్మపురి: సైన్స్ ఎగ్జిబీషన్ ప్రదర్శనలతో విద్యార్థుల మేధో సంపత్తి పెంపొందిస్తుందని సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ధర్మపురిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో శనివారం సైన్స్ పదర్శనలు ఇచ్చారు. కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్సైలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ దినేష్, ప్రిన్సిపాల్ తోట శంకర్, డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

కోరుట్ల: పట్టణంలోని గౌతం మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రదర్శనను మండల విద్యాధికారి గంగుల నరేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ సెంట్రల్ కమిటీ సభ్యుడు డాక్టర్ అనూప్ రావు, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాట్లవాయిలో నారాయణ హోమం



రాయికల్: మండలంలోని తాట్లవాయిలో సీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో భాగంగా అర్చకులు శ్యామ్‌సుందరాచార్యులు, రంగాచార్యులు, మురళీ, మదన్‌మోహన్ ఆధ్వర్యంలో నారాయణ హోమం, ఏకశిల స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

- **తాగునీటి సమస్య పరిష్కరించాలి**

సారంగాపూర్: తాగడానికి నీరు రావడం లేదని, సమస్య వెంటనే పరిష్కరించాలని మండలంలోని లక్ష్మీదేవిపల్లి నాయికపుగూడెం వాసులు కోరుతున్నారు. గూడెంలో 350 వరకు జనాభా ఉంటుందని, చాల రోజులుగా తాగునీరు, ఇతర అవసరాలకు నీరు లేకపోవడంతో పొలాల వద్ద నుంచి వ్యవసాయ బావుల్లోని నీటిని తీసుకువచ్చుకుంటున్నామని, తమ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరితె వారు స్పందించడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి వెంటనే సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

- **ఏబీహెచ్‌ఏ కార్డుల కోసం ఎదురుచూపులు**

జగిత్యాల: సీనియర్ సిటిజన్ల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన అనారోగ్య యోజన పథకం ప్రవేశపెట్టిందని, ఈ కార్డుల కోసం ఎదురుచూస్తున్నామని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ అన్నారు. శనివారం కార్యాలయంలో ఆరోగ్య సలహాలకు సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో విశ్వనాథం, ప్రకాశ్‌రావు, బొల్లం విజయ్, హన్మంతరెడ్డి, యాకూబ్, అశోక్ రావు పాల్గొన్నారు.

- **ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యూరియా కొరత**

జగిత్యాలరూరల్: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జగిత్యాల జిల్లాలో యూరియా కొరత ఏర్పడిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నలువాల తిరుపతి అన్నారు. శనివారం మాట్లాడుతూ, జిల్లాలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో ఎక్కడ యూరియా కొరత లేదన్నారు. యూరియా దొరకకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమన్నారు.

- **మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలి**

మల్లాపూర్: రంజాన్ మాసంలో మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని ముస్లిం మైనార్టీ కమిటీ మండల అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ అన్నారు. శనివారం మల్లాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శశికుమార్ రెడ్డికి కమిటీ సభ్యులతో కలిసి ఆయన వినతిపత్రం అందించారు. మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ కమిటీ మండల ఉపాధ్యాక్షుడు మహ్మద్ బషీర్, ప్రధాన కార్యదర్శి ఎండీ.అష్రఫ్, కోశాధికారి, కో–ఆర్డినేటర్ మహ్మద్ బాబాఫరీద్, కార్యదర్శులు ఎండీ.ఇషాక్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

- **నేడు ఉచిత వైద్యశిబిరం**

కథలాపూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కరీంనగర్‌కు చెందిన అపోలో రీచ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మాజీ జెడ్పీటీసీ నాగం భూమయ్య తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యశిబిరం ఉంటుందని, మండల ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

- **నేడు రాయికల్‌లో మెగా జాబ్‌మేళా**

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో దయానంద్‌రెడ్డి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తుమ్మల సదాశివరెడ్డి, డాక్టర్ రాజిరెడ్డి శనివారం తెలిపారు. పదో తరగతి పాసై, 18 ఏళ్లు పైబడిన యువతులు మాత్రమే అర్హులని, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విజ్ఞాన యాత్రకు విద్యార్థినులు

జగిత్యాల: క్షేత్ర పర్యటనలతో విజ్ఞానం పెరుగుతుందని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ అన్నారు. శనివారం కళాశాల విద్యార్థినులు పొలాసలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలోని ఎంటమాలజీ విభాగాన్ని సందర్శించారు. అక్కడ కీటకాలను సేకరించే పరికరాలు, నిల్వ ఉంచే విధానాలను పరిశీలించారు. అనంతరం పొలాసలోని పొలస్తేశ్వరాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నీరజ, ప్రమోద్‌కుమార్, శ్రీలత, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

జగిత్యాల: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జగిత్యాలలోని 30 మసీదులకు శనివారం బ్లీచింగ్ పౌడర్‌ను మున్సిపల్ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలని కోరారు. మసీదుల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది, అధికారులకు ప్రశంసలు

సారంగాపూర్: దుబ్బరాజన్న జాతర బ్రహ్మోత్సవాల్లో విద్యుత్ సిబ్బంది, అధికారుల సేవలను ను ఉన్నతాధికారులు, భక్తులు ప్రశంసించారు. ఐదు రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు తాత్కాలిక లైన్లతో నిరంతర విద్యుత్ సరఫరా చేశారు. ఏఈ ప్రవీణ్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాకు సహకరించిన ఎస్ఈ సాలియానాయక్, డీఈ గోపికృష్ణ, ఏడీఈ సింధూ శర్మ, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.